# ఆమె ఎవరు?

—జి. వనజ

సీతా.... సునీత.... ఎక్కడ ఉన్నావు డియర్ ?" చిన్నగా ఈల వేస్తూ వంటింట్లోకి వచ్చాడు మధు. పొయ్యి మీద పెడుతున్న భార్యకు దగ్గరగా వెళ్ళి 'సీతా' అన్నాడు గుసగుసగా.

"........ ......."

"మాట్లాడ దలచుకో లేదాండీ భార్యామణి గారూ !"

"ఊహుఁ !"

"ఎందుకు ?"

"మీ మీద నాకు కోపం వచ్చింది. మా అమ్మ నాన్న నా పేరు సీత అని పెట్టుకుంటే మీరు దాన్ని కాస్త వదిలేసి సీతా అని పిలుస్తుంటే ఎలా మాట్లాడను మీతో !"

"ఓ అదాండీ తమరి కోపానికి కారణం. కానీ నాకీ పేరే ఇష్టం ఇలాగే పిలుస్తాను. పిలవట మేమిటి. అందరికీ ఈ పేరు తోనే నిన్ను పరిచయం చేస్తాను"

"నాకు ఇష్టంలేదని చెపుతుంటే ఏమిటి మీ...."

"కానీ నా కిష్టమేకదా ! పోనీ నీకూ మోజుగా ఉంటే నన్ను నీ యిష్టంవచ్చిన పేరుతో పిలుచుకో ! నాకేం అభ్యంతరం లేదు డియర్.

"ఇంకా పేరుపెట్టి పిలవట మొక్కటే తక్కువ."

"పాత చింతకాయ పచ్చడి" చిన్నగా అనుకోబోయి పైకి అనేశాడు.

"ఏమన్నారూ ? సీత కోపంగా ముందుకు వచ్చేసింది.

"అబ్బే . ఏంలేదు. పతివ్రత అనబోయి పాత చింతకాయ అన్నాను. అయితే సరే. టాపిక్ మార్చేద్దాం. నీకో మాట చెప్పాలని వస్తే వాదన మొదలెట్టావు. సాయంత్రం నేను వచ్చేసరికి అందాలబొమ్మలా తయారై ఎదురు రావాలి ఎందుకంటే మనిద్దరం కలసి ఈ రోజు పిక్చర్‌కు వెళ్ళాలి అనుకున్నాం కనుక.

"ఎవరనుకున్నారు ?"

"అబ్బ ! నేననుకుంటే నువ్వను కున్నట్లేగా ?

"అహా. అలాగా. ఈ విషయం నాకు తెలియదులెండి ! కానీ ఒక్క షరతు. మీరు సీత అని పిలుస్తేనే వస్తాను"

"ఊహూ, నేను పిలవను"

"ఊహూ, నేను రాను అయితే."

"సరే పిలుస్తాను సీతా !"

"అయితే వస్తాను స్వామీ !"

"అబ్బ ! ఉత్త మొండి దానివి. పంతం నెగ్గించుకుంటావు."

"మీరు మహా నెమ్మదస్తులు గానీ ముందు ఆఫీసుకు వెళ్ళండి. మీకే చెప్పేది ఏమిటలా మీద మీదకు వస్తారు ? వెళ్ళండి. నాకు కోపం వచ్చేస్తుంది."

"నీకు కోపం వస్తుందని వెళ్ళటం లేదు గానీ నా ఆఫీసు టైమ్ అవుతుందని వెళ్తున్నాను. ఇప్పటికి తప్పించు కున్నావు కానీ సాయంత్రం తప్పించు కోలేవు డియర్. టా....టా తలుపు వేసుకో"

* * *

"సీతా, ఆర్ యూ రెడీ ? నే వచ్చేశాను.

"వచ్చేశారా ? స్నానం చేసి రండి" కాఫీ ఇస్తాను.

"అది సరే, ఇంకా తయారు కాలేదే ! ఇప్పటి నుండి మొదలు పెడితే సరిగ్గా పిక్చర్

మైంకు సింగారం పూర్తి అవుతుందో లేదో! ఇందాకటి నుంచి ఏంచేస్తున్నావు?'

"ఏం చేయటం లేదు. మీ కోసం చూస్తున్నాను! నాకు విపరీతంగా తల నొప్పిగా ఉందండి! ఎలా వచ్చేది?

"ఈ విషయం చెప్పాలని నా కోసం వేయి కనులతో ఎదురుచూస్తున్నావా చకోరీ! వీల్లేదు. టికెట్స్ కూడా తెచ్చాను. లే, మరి."

"అదికాదండి. నాకైతే సినిమా చూస్తుంటేనే తలనొప్పి వస్తుందండి. ఎలా వచ్చేది. నేను రాను మీరు కూడ వెళ్ళద్దు ఇంట్లో కూర్చొని కబుర్లు చెప్పండి!"

"ఏం కబుర్లు! కాకమ్మ కబుర్లా!"

"అబ్బ. ఎందుకలా ఎగతాళి చేస్తారు?"

"మరేం చెయ్యను. వారు ఇంట్లో కూర్చుంటే తోచదు, నేను బయటకు రావాలంటే సిగ్గు. నాకు తెలుసు. అందుకే తల నొప్పి వంక పెట్టుకొని ఎక్కడకూ రానంటున్నావు పోనీ పార్కుకు వెళ్దామా? మన వైపు ఎవరూ చూడరు. నీ ముఖం నేనూ, నా ముఖం నువ్వు చూసుకుంటూ ...."

"నాకు చదువురాదనీ మీకు తెలుసు. బయటకు ఎక్కువగా వెళ్ళే అలవాటూ లేదనీ మీకుతెలుసు తెలిసేచేసుకున్నారుగా! ఇప్పుడు బాధపడి ఏం ప్రయోజనం"

"అందాల బొమ్మవు కదా అని చేసుకున్నాను. ఏం చేయను? ఆ బొమ్మను నా ఇష్టం వచ్చినట్లు మలచుకోవచ్చు అనుకున్నాను కానీ మాట వింటుందా! పెంకిఘటం."

"............"

ప్లీజ్ సీతా! ఈ ఒక్కసారి రా! మనిద్దరం కలసి బయటకు వెళ్ళి ఎన్నిరోజులైంది? నా కోరిక తీర్చవా?

"అదికాదండీ! బయటకు వస్తే మీకెంతమందో తెలిసినవాళ్ళుంటారు. వాళ్ళకు నన్ను పరిచయం చేస్తారు. వాళ్ళను పలకరించటం. మాట్లాడటం.... నాకేదో దడగా ఉంటుంది. నేను రానండీ!

"బ్రతిమిలాడుతున్నానని బెట్టు చేస్తున్నావా? నాక్కావాలంటే కోటి మంది ఆడపిల్లలు ముందు నిలబడతారు, తెలుసా!

"మీకు పుణ్యం ఉంటుంది. వాళ్ళతో వెళ్ళండి."

"వెళ్ళక నీ వెంబడే పడతాననుకున్నావా? ఆ ఆశలేం పెట్టుకోను. రాత్రి ఆలస్యంగా

## 'ప్రమిద – ప్రమద'



—కె. సీతారామరాజు, అనపర్తి.

వస్తాయి నా కోసం ఎదురు చూడొద్దు."

"చెప్పారుగా ! చూడను."

"నువ్వుకూడ ఆడపిల్లలతో సినిమాకు వెళ్ళ మన్నావుగా! వెళ్తున్నాను" నేను కాలేజీలో చదివేటప్పుడు ఒక అమ్మాయి ఉండేది. ఆమెతో వెళ్తాను ఆమెకు నేనంటే ప్రాణం.

"ఆఁ. మిమ్మల్నిక్కడ ఆమె అంటే ప్రాణమా ?"

"అప్పట్లో నా హృదయాధి దేవత" వస్తా.

"నిజంగా వెళ్తున్నారా !"

"అబద్ధమను కుంటున్నావా ?"

"నాకేం తలనొప్పి లేదు తగ్గి పోయింది. వస్తాను. ఉండండి."

"అక్కడ నా హృదయాధి దేవతలతో కలిసి వెళ్ళాలనుకున్నానే! ఎలా ?

"ఇదిగో ! మీరిలాంటి పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడారంటే మిమ్మల్నసలు బయటకు కదలనివ్వను

"ఏం చేస్తావు? హృదయంలో దాచు కుంటావా ? అరె, అంతలోనే కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయేమిటి ?

"ముక్కూ, ముఖం తెలియని వాళ్ళను ప్రాణం....ప్రేయసి అంటుంటే మరి తిరగ వేమిటి?" హఠాత్తుగా భర్త హృదయంలో తలదాచుకుంది సీత.

"యు సిల్లీ ఫెలో! ఈ అమాయకత్వమే నన్నాకర్షించింది" అందుకే నిన్ను చేసు కున్నాను. కానీ లైఫ్ ఎన్‌జాయ్ చెయ్యటం నేర్చుకోవాలి సీతా! ఇలా నాలుగు గోడల మధ్య గిరిగీసుకుని కూర్చుంటే ఎవరికి సుఖం ఉంటుంది చెప్పు.

మీరు నన్నేం చేయమంటారు ? చిన్న తనం నుండీ ఉన్న అలవాట్లను ఒక్కసారిగా మార్చుకోమంటే ఎలా ? ఈ జీవితానికే అలవాటుపడ్డ నేను మిమ్మల్ని సుఖపెట్టలేక పోతున్నాను. నన్ను క్షమించండి ...

"మీ కోసం మారగలనేమో ప్రయ త్నిస్తాను...."కన్నీళ్ళతో అంద

"నువ్వుమారటం ఈజన్మలో జరగదేమో సీతా...." విరక్తిగా....భారంగా తనను వది లేసి వెళ్తున్న భర్తను చూస్తూ నిలబడి పోయింది సీత.

* * *

"ఏమండీ...."

........

"మాట్లాడరే పిలుస్తుంటే ?"

"పిలిచావా ? ఏమిటీ ?"

"మీకు తెలియదా? మీరెందుకు ఈమధ్య పరధ్యాన్నంగా ఉంటున్నారు ?"

"మనసు బాగుండక."

"ఏమైంది మీ మనసుకు ?"

"ఏదో ఒకటి అయింది."

"నాకు చెప్పకూడదా..."

"అబ్బబ్బ.... సీతా.... విసిగించకు వెళ్ళు.

"వారం రోజుల నుండి మీరు ఎలాగో ఉంటున్నారు మనసు ఊరుకోక కారణం తెలుసుకోవాలని వచ్చాను కానీ మిమ్మల్ని విసిగించాలని కాదు.

"సీతా ...

"పదిసార్లు చెప్పించుకొనే అలవాటు లేదు వెళ్తున్నాను."

* * *

మధూ.... మధూ !

ఆయ నింట్లో లేరు. మీరు...."

"నా పేరు శాంతి. మేము కలిసి చదువు కున్నాము. మీరు మధు...."

"వారు నా భర్త. లోపలకు రండి" ఆఫీసునుండి వచ్చే టైమయింది.కూర్చోండి.

"నేను వైజాగ్‌లో ఉద్యోగం చేస్తున్నా నండి! మధు నన్ను రమ్మని ఎప్పుడూ ఉత్త రాలు వ్రాస్తుంటాడు. వారం రోజులు లీవ్ పెట్టి మధుతో గడపాలని వచ్చాను మీకు ఆశ్చర్యంగా ఉంది కదూ ! మధుకు ఆడపిల్ల లతో స్నేహ మేమిటని ?"

"అబ్బే....అదేం లేదు" తన మనసులో

మాట శాంతే అనేసరికి సీత ఉలిక్కిపడింది.

"చాలమంది అలాగే అనుకుంటారు. కానీ పవిత్ర స్నేహానికి ఆడ, మగ తేడా ఏమిటండీ! అవునూ మీరేం చదువుకున్నారు?"

"ఏం చదువుకోలేదు. ఉండండి కాఫీ తెస్తాను." సీత లోపలకు వెళ్ళింది.

"ఆమె మనసులో అగ్ని పర్వతాలు బ్రద్దలవుతున్నాయి. పవిత్ర స్నేహమట చెప్పుకోవటానికి సిగ్గైనా లేదు. ఇంకా సెలవుపెట్టి మధుతో గడపాలని వచ్చిందట" ఛీఛీ! ఆవిడ ఆడదేనా! కాలేజీలో ఉన్న ప్రాణ స్నేహితురాలు ఈవిడే కాబోలు. ఆరోజు సరదాగా అన్నారేమో అనుకున్నాను. నిజంగా తనెంత అమాయకురాలు? అంతలో బయట చప్పుడైంది.

"హల్లో సీతా ఎంతసేపయింది వచ్చి? మధు కంఠంలో సంతోషం తొణికిసలాడుతుంది. ఇన్నాళ్ల ఉన్న దిగులంతా ఏమైందో! సీత హృదయం కోపంతో భగ్గుమంది.

"మధూ! నీ వైఫ్‌ను చూసాను. నాకు బాగా నచ్చింది. చాల అందంగ ఉంది.

"ఎలా నచ్చింది నీకు? నీలాగా నాలాగ చదువుకోలేదు బయటకు రావాలంటే భయం.

సోషల్‌గా అందరితో కలిసి ఉండేటట్లు నువ్వే అలవాటు చేయకపోయావా? నవ్వుతూ అంది శాంతి.

"అదీ అయింది. ఇష్టం లేని పనిని బలవంతాన చెయ్యమంటే మిగిలేది అశాంతి ఇంతకూ లోపల ఏం చేస్తుంది శాంతి! నిన్ను నేనెప్పుడూ సీతా అనే పిలుస్తాను నిన్ను మర్చిపోలేక పోతున్నాను. అందుకే నా భార్యను కూడ సీతా అనే పిలుస్తాను. కానీ సీత అలా పిలవద్దు అంటుంది. చెప్పాను గా పాత చింతకాయపచ్చడి.

"సీతకు తల తిరుగుతున్నట్లనిపించింది. ఎందుకో ఆమె హృదయం మూగగా రోదించింది ఇప్పటికి అర్థమైంది. ఆ ప్రేయసీ ప్రియులు మాటల్లోపడి కాఫీమాట అడగటం మర్చిపోయారు. వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటుంటే మధ్యలో తను వెళ్తే ఏం ధర్మం?

"సీతా! కాఫీ తీసుకురా! మధు పిలుపు విని ఉలిక్కిపడింది, ట్రేలో రెండు కప్పులు ఉంచి హాల్లోకి వచ్చింది."

"సీతా, మీరిద్దరూ ముందే పరిచయం చేసుకున్నారుగా, ఇక నా బాధ్యత ఏమీ లేదు. కాఫీ శాంతి కందిస్తూ నవ్వుతూ అన్నాడు.

"మధూ! మీ సిటీ అంతా నాకు చూపించాలి" వెళ్దామా! కాఫీ తాగి క్రింద పెడ్తూ అంది శాంతి

"ఓకే మేడమ్! ఏం సీతా! శాంతి అలా రౌండ్ కొట్టి వద్దామంటుంది వస్తావా?

"నేను రాలేనండీ! మీరు వెళ్ళండి. ఒంట్లో బాగుండలేదు." నిదానంగా అంది సీత.

"నేను చెప్పలేదూ శాంతి! ఎప్పుడూ ఎక్కడకూ రాదు. ఇలాగే వంక పెడుతుంది. ఆవిడతో పెట్టుకుంటే ఇహ మనం ఎక్కడకూ వెళ్ళలేం." లోపలకు వెళ్తున్న సీతకు తన హృదయాన్ని ఎవరో రంపంతో కోసినంత బాధ కల్గింది.

"అవునుమరి. వంక పెడుతుంది." మొక్కుబడిగా అడిగేశావు రా ననగానే ఇద్దరూ వెళ్ళటానికి తయారయ్యారు. భార్య ఉండగా పరాయిస్త్రీతో అలా తిరగటానికి మనసెలా ఒప్పుతుంది. తనకెంత చదువు రాకపోయినా ఈ మాత్రం గ్రహించుకోలేదా? ఇంకా తను పాత చింతకాయ పచ్చడట. భార్యను అవమానించటం గొప్పతనం కాబోలు.

బయట కారు స్టార్టయిన చప్పుడు విన్పించింది. ఏమిటింత బాధ పడుతుంది తను. ఒళ్లెందుకిలా తూలిపోతుంది? అసలు నన్ను ప్రేమించని వారిగురించి నాకెందుకీ ఆరాటం. తల రెండుచేతుల్తో గట్టిగా నొక్కు-

ఉంది భారమైన మనసుతో అలాగే మత్తుగా నిద్రపోయింది. మెలుకువ వచ్చేసరికి హాల్లో శాంతి - మధుల నవ్వులు విన్పించాయి. సీత సహించలేక పోయింది. పదింటి దాకా తిరుగుతూనే ఉన్నారన్న మాట. అంతలోనే మధు లోపలకు వచ్చాడు.

"అరె, ఏమిటీ నిద్రపోయావా? భోజనం వండావా? ఈ రోజేమిటి స్పెషల్ సీతా!"


"ఏం చేయలేను అసలేం వండలేదు. మంచం మీదనుండి లేస్తూ అంది

"అదేమిటి? ఏం చెయ్యలేదా? ఇప్పుడు శాంత భోజనం ఎలా?"

"పొరపాటయింది ఒప్పుకుంటున్నాను. ఇప్పుడే పదినిముషాల్లో చేస్తాను మీ శాంతి అదే సీతకు ఏ బాధ కలుగనీయను. బాధ్యతారహితంగా ప్రవర్తించినందుకు నన్ను క్షమించాలి."

---

## సంక్రాంతి ముగ్గు



—బాలాత్రిపుర సుందరి, విజయవాడ-2

"సీతా ఏమిటిది? ఎందుకిలా మాట్లాడుతున్నావు?" వెళ్ళబోతున్న భార్య చెయ్యి పట్టుకొని ఉలిక్కిపడ్డాడు.

"అరె, ఇదేమిటి?" దగ్గరగా లాక్కొని నుదుటిమీద చెయ్యివేసి చూసాడు. "నీ ఒళ్ళు ఇంత వేడిగా ఉందేమిటి? జ్వరం వచ్చిందా? మరి చెప్పవేం?"

"ఏం చెప్పాలి? ఇప్పుడు చూశారుగా. అది నా ఒంట్లో వేడి కాదు. నా మనసులో వేడి ఇది కూడ మీకు అన్నంవండి పెట్టలేక పెట్టిన వంక అనుకోకండి. తనేం మాట్లాడుతుందో అర్థకాకుండ అంది.

"ఏమిటిసీతా, నీకేమైనా పిచ్చెక్కిందా? నేనేమి అనలేదే నిన్ను ఎందుకింత ఆవేశపడుతున్నావు?"

"మీరు నన్నేం అనలేదు. కానీ ఇప్పుడు మీ సీతా వచ్చింది. కాబట్టి నన్ను సీతా అనటానికి మీకేం అభ్యంతరం ఉండదనుకుంటాను."

"నోర్మూయ్, నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుసా! అపార్థాల అడ్డుగోడలు కట్టుకొని మనమధ్య ఉన్న అనుబంధాన్ని చేతులారా తెంచకు."

మీరే తెంచాలనుకుంటున్నారు. లేకపోతే ఆవిడ ముందు అలా నన్ను తక్కువచేసి మాట్లాడతారా! మధు దానికేం సమాధానం చెప్పలేదు. సీత ఏడుపు అతని హృదయాన్ని కదలించివేసింది."

"నువ్వు అన్నం వండద్దు నేను క్యారియర్ తెస్తాను."

"మీ ఇష్టం కానీ నేను భోజనంచెయ్యను. మీ ఇద్దరివరకూ తెచ్చుకోండి" ఆగకుండ వెళ్ళిపోయింది.

* * *

అక్కా........తలుపు తియ్యి........నేను చంద్రాన్ని."

తలుపు తీసిన శాంతినిచూసి చంద్రం

ఒక్కడుగు వెనక్కు వేశాడు. ఎవరింటికి వచ్చానా అనుకుంటూ అంతలో సీతబయటకు వచ్చింది

"అదేమిటి చంద్రం లోపలకురా! ఆవిడ ఎవరా అని చూస్తున్నావా! ముందు లోప లకురా! చెప్తాను. చంద్రాన్ని చూస్తూనే శాంతి లోపలకు వెళ్ళిపోయింది.

* * *

సీత చెప్పిందంతా విని నిర్ఘాంత పోయాడు చంద్రం.

అదేమిటక్కా! బావ అలా చేస్తారంటే నేను నమ్మను" చిన్నప్పటి నుంచీ మన ఇంటి ప్రక్కనే ఉండేవారు. ఎంతో మంచి వాడు కదూ! అయినా ఆవిడ మాత్రం ఇలా పరాయి మగవాడితో తిరగడానికి ....

"అసలు ఈయనకు సిగ్గుందా ఆవిడను అనటానికి .... ఇప్పటికి ఆవిడ వచ్చి వారం అయింది. వెళ్ళిపోతాను మధూ అంటే బల వంతాన ఆపారు. నా మనస్సెంత క్షోభ పడు తుందో ఎవరికి చెప్పుకోను చంద్రం." చిన్న పిల్లలా వెక్కి వెక్కి ఏడుస్తున్న అక్కను చూసి జాలిపడ్డాడు.

"అదేమంటే ఈ మధ్య ఇంకోమాట అంటున్నారు నేను చాలమోటుగా ఉంటా నట. ఆయనకు అధునాతనంగా ఉండే భార్య కావాలట.

"పోనీ అక్కా నువ్వే బావ కిష్టమైనట్లు నడుచుకోవచ్చుగా!

"ఎలా చంద్రం. నా కేదో భయంగా ఉంటుంది

"అందుకని ఎవరో వచ్చి బావను ఎగరే సుకు పోతుంటే చూస్తు కూర్చుంటావా? బావ కోరినట్లు అలంకరించుకో, ఎక్కడకు రమ్మంటే అక్కడకు వెళ్ళు. ఒక్క క్షణం వదలిపెట్టకు. నీ అందం ముందు శాంతీ.... అశాంతీ బలాదూర్! ఈ రోజునుంచే నేను చెప్పినట్లు చెయ్యి." ఆ శాంతిని ఎక్కడో చూసినట్లు ఉందక్కా! ఆలోచిస్తూ అన్నాడు చంద్రం.

"అలాంటివాళ్లు ఎక్కడైనా కన్పిస్తుం టారు. చిరాగ్గా అంది సీత.

* * *

శాంతీ! ఈ రోజు ఎగ్జిబిషన్ చూద్దామా! మధు తలదువ్వుకుంటూ అడిగాడు

ఓ. కే. డార్లింగ్, మధు దగ్గరగా వెళ్ళ బోయి వస్తున్న సీతను ఆశ్చర్యంగా చూసింది. మధు బొమ్మలా నిలబడి పోయాడు తెల్లటి షిఫాన్ చీరెలో....అంద మైన సిగతో, మెడలో ధగ ధగలాడే నెక్లెస్‌తో మెరిసిపోతుంది. సీత.

సీతా.... నువ్వు! పాలరాతి బొమ్మలా ఉన్న భార్యను కన్నార్పకుండ చూస్తున్నాడు నేనూ ఎగ్జిబిషన్‌కు వస్తాను మీతో.

ఓ. కే. సీతా! ఉషారుగా అన్నాడు మధు" శాంతి చిన్న బోయిన ముఖంతో నిలబడింది"

* * *

చంద్రం. మీ అక్క ఇలాగ అలంకరించు కుంటే చాలా బాగుంది కదూ! రోజూ ఇలాగే ఉంటే .."

"అదే నేనూ చెప్పాను బావా! లేకపోతే బావ మనసు ఎటువైపైనా మారవచ్చుఅని."

చంద్రం! అసలు శాంతి ఇక్కడ వున్న ప్పటినుండీ చూస్తున్నాను. సీత ముభావం గానే ప్రవర్తిస్తుంది. ఆవిడ నా కెంతో ప్రియమైనది, మొహమాటం ఎందుకు నిజమే చెప్తున్నాను. చిన్నప్పటినుంచీ మే మిద్దరం ఒకళ్ళని విడిచి ఒకళ్ళు ఉండలేదు.

చంద్రం మనసులో హఠాత్తుగా ఏదో ఆలోచన తళుక్కుమంది.

"మధూ .... అందరూ అటు తిరిగి చూసారు శాంతి నిలబడి వుంది.

"మధూ! నా గురించి మీ ఇంట్లో ఇలా కలతలు వస్తాయి అనుకోలేదు. నేను రేపే

వెళ్లిపోతాను మధూ, మన స్నేహానికి ఇంతటితో గుడ్‌బై....

* * *

"సీతా....పదయింది ఇంకా పడుకోలేదే ?"

"సీతా అనే పిలవండి నన్ను" మనస్ఫూర్తిగా చెప్తున్నాను.

"సీ..తా ! ఈరోజెంత అందంగా ఉన్నావో తెలుసా ! దివినుండి దిగి వచ్చిన దేవకన్యలా !"

"మీకు నేనిలా ఉంటేనే ఇష్టమా ?"

"ఎందుకిష్టం ఉండదు ?"

"అయితే సరే మీకెలా కావాలో అలా మలచుకొండి నన్ను. అంతే....అంతే కానీ శాంతీ — శాంతీ అంటూ ఆవిడ చుట్టూ తిరగకండి. మీ పాదాలు పట్టుకుంటాను శాంతిని పంపించేస్తారు కదూ ! మీ పరువు ప్రతిష్ట ఇలా నాశనం కావటం నేను సహించలేను సీత ఏడుస్తుంది.

"ఏడవకు సీతా, నీ కోసం నీ తృప్తి కోసం రేపు ఆవిడను పంపించేస్తాను మధు సీతను దగ్గరకు తీసుకొని ఓదార్చాడు తృప్తిగా అతని ఒడిలో నిదురపోయింది సీత.

పిచ్చి సీతా ! నిన్నెంత బాధపెట్టాను ! ఆప్యాయంగా ముంగురులు సవరిస్తూ అనుకున్నాడు మధు.

* * *

చంద్రం నీకే చెప్పేది, నన్ను వదులు. ప్లీజ్ చంద్రం."

శాంతి అరుపులు విని మధు, సీత గదిలోకి వచ్చారు.

"వదలను, నువ్వు నా ప్రాణం, నిన్ను పెళ్ళి చేసుకుంటాను.

"ఛీ, నీకే చెప్పేది ? నాతో నీకు సరసాలేమిటి ?

"ఓం నువ్వు ఆడదానివి కాదా నేను మగవాడిని కానా ! కాదనకు శాంతీ ! చంద్రం ప్రతిమిలాడుతుంటే సీత తెల్లబోయింది.

"చంద్రం" అంటూ పెద్దగా అరచింది.

"భయపడకు అక్కా ! ఈ శాంతి ఎవరో నీకు తెలుసా ?"

"ఎవరామె ? నీకు తెలుసా ?"

"మధు బావ ప్రాణస్నేహితుడు రాజు. నీకు జ్ఞాపకం లేదేమో ! చిన్నప్పుడు ఆడదానిలా వేషాలువేసి అందరినీ అదరగొట్టేసే వాడు. ఇప్పుడు అద్భుతమైన నటనతో నిన్ను అదరగొట్టేసాడు."

"ఏమిటండీ ! భర్తవైపు చూస్తూ ఆశ్చర్యంగా అంది."

ఏమిలేదు....నేను మరొక అమ్మాయితో తిరిగితేనె నా నువ్వు భయంతో కొంచమైనా ఫ్యాషనబుల్‌గా తయారవటం నేర్చుకుంటావని....

"నేనూ....మధూ కలిసి మిమ్మల్ని బాగా బాధపెట్టాం. క్షమించండి." తలమీద విగ్ తీసేస్తూ అన్నాడు రాజు నవ్వుతూ !

"ఈ చంద్రం నన్నెక్కడ పెళ్లిచేసుకుంటాడోనని హడలి చచ్చాను." ఇదంతా చూస్తుంటే సీతకు నవ్వాలో ఏడవాలో తెలియలేదు.

"మీరు నన్ను మార్చాలని ఇంత ప్రయత్నం చేశారా ! కానీ నేను మిమ్మల్ని అపార్థం చేసుకొని మీ గురించి చాల చెడ్డగా ఊహించుకున్నాను. నన్ను క్షమించండి." బాదగా అంది.

"ఊహించుకున్నావా ! అయితే నేనూ నీ మనసు బాధపెట్టాను. నన్నూ నువ్వు క్షమించు." మధు అంటుంటే చంద్రం చెల్లుకు చెల్లు అనేసాడు.

అందరి నవ్వులతో ఆ హాలు నిండిపోయింది.